# తాజ్‌మహల్

దేవినేని ఉష

టీనగర్ బస్ స్టాప్‌లో బస్ దిగాడు వంశీ తలవంచుకుని గబగబా ముందుకు సాగాడు

ఎదురుగా రెండు అంతస్తుల బిల్డింగ్ దానికి కాస్త దూరంగా ఆగాడు

పక్క నుండి పోయే వ్యక్తిని అడిగాడు సినిమా నటి నర్మద ఇల్లు అదేనా' అంటూ ఇంగ్లీషులో

అవును"అంటూ అతనూ ఇంగ్లీషులో నే జవాబు ఇచ్చి ముందుకు సాగిపోయాడు

చేతిలో ని బ్యాగ్ బరువుగా ఉంది దాన్ని పదిలంగా మెయిన్‌రోడ్ మీద పెట్టాడు

షర్ట్ జేబు తడుముకున్నాడు ఖాళీ- పాంట్ జేబులో చెయ్యి పెట్టాడు ఒక సిగరెట్ దొరికింది అగ్గిపెట్టె కూడా ఆ సిగరెట్‌తో వచ్చింది

సిగరెట్ వెలిగించి తృప్తిగా పీల్చాడు ప్రయాణంలో అలసిపోయిన శరీరం హాయిగా రిలీఫ్ పొందింది

ఒకసారి తలవంచి తనను చూసుకున్నాడు దుమ్ము 'కొట్టుకుపోయిన దుస్తులు, వడలిన శరీరం ఎక్కువగా స్మోకింగ్ చేయడం వలన నల్లగా బండబారిన పెదవులు సరైన నిద్రాహారాలు లేక గుంటలుపడ్డ కళ్ళు

అతని పెదవులపై విరక్తి పూర్వకమైన నవ్వు విరిసింది సిగరెట్ చివరి వరకూ కాలి వేళ్ళు చురుక్కుమన్నాయి చేయి విదిల్చాడు నుసి రాలిపడింది

తిరిగి బ్యాగ్ భుజాన తగిలించుకుని కదిలాడు ఆ రెండంతస్తుల బిల్డింగ్ దగ్గర ఆగాడు గేటు లాక్ చేసి ఉంది గూర్ఖా ఆ గేటు ముందు స్టూల్ మీద కూర్చుని ఉన్నాడు

అప్పటికి సమయం రాత్రి తొమ్మిది గంటలు అవుతోంది అయినా గేటుపైన ఉన్న మెర్క్యురీ లైటు కాంతిలో అక్కడ పట్టపగల్లా వెన్నెలలా ఉంది లోపల బిల్డింగ్ కూడా దీపాల కాంతిలో తేజోమయంగా కనబడుతోంది

గూర్ఖా వంశీని చూసి నిర్లక్ష్యంగా తలతిప్పుకున్నాడు వంశీలా కాలినడకన వచ్చిన మనుషులకు అక్కడ వాల్యూలేదు

కారులో వస్తే సలాంకొట్టి గేటు బార్లా తీస్తాడు

నర్మదగారున్నారా' అచ్చ తెలుగులో అడిగాడు వంశీ ఇంగ్లీషులో అడిగితే అతనికి అర్థం కాదని తెలుసు

లేరు నిర్లక్ష్యంగా అన్నాడు గూర్ఖా తెలుగులోనే

నేను అరగంట క్రితం ఫోన్ చేశాను ఉన్నారని విన్నాను నన్ను లోపలకు వెళ్ళనీయి వంశీ అన్నాడు

వెళ్ళవయ్యా బాబూ!! ఇలా అందర్నీ లోపలకు పంపిస్తే నా ఉద్యోగం ఊడుతుంది కోపం ప్రదర్శించాడు గూర్ఖా

అంతేకాదు ముందుకు వస్తున్న వంశీని వెనక్కి తోసివారేశాడు బ్యాగ్ కింద పడబోయింది దాన్ని చప్పున పట్టుకున్నాడు వంశీ అతని కళ్ళు కోపంతో ప్రజ్వరిల్లసాగాయి

'నర్మదా!! నర్మదా' భువనాలు అదిరిపోయేలా కేకలు పెట్టాడు

బాల్కనీలోకి వచ్చింది నర్మద ఆమె ఆంధ్రుల ఆరాధ్య నటి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో అశేషంగా నటిస్తున్న ప్రఖ్యాత నటీమణి

అంత గొప్ప నటి తన్ను పేరు పెట్టి పిలిచేది ఎవరా'' అన్న కోపంతో బాల్కనీలోకి వచ్చింది

అక్కడగేట్ దగ్గర గూర్ఖాతో ఘర్షణ పడుతున్న వంశీని చూసింది ఆమె నిర్విణ్ణురాలయింది

దాదా!! అతన్ని లోపలకు పంపు కేకపెట్టింది

అంతే నాగస్వరం విన్న తాచులా గూర్ఖా వంశీతో ఘర్షణ ఆపేసాడు తాళం తీసి గేట్ తెరిచాడు

వంశీ విజయగర్వంతో లోపలకు నడిచాడు

నర్మద ఎదురు వచ్చింది

ఆమె శరీరం ఏమీ మారలేదు స్లిమ్‌గా, మంచి కాంతితో వెలుగుతోంది

ఆమెలోని అందం సెల్యులాయిడ్‌పై మరింత మెరిసి పొగలుగుతుంది అందుకే ఆమె సినిమా రంగంలో ప్రముఖ నటిగా అందరి ప్రశంసలు అందుకో గలుగుతోంది

నర్మద వంశీని చూసి చిరునవ్వు నవ్వింది

వంశీ ఏదో మాట్లాడబోయాడు

ప్లీజ్!! మనం ఉదయం మాట్లాడుకుందాం మీరు ఇప్పుడు చాలా దస్సిపోయి ఉంటారు వెళ్ళండి అంటూ పనిమనిషిని పిలిచి అతన్ని అప్పగించింది

నర్మద అలా అనడానికి కారణం ఉంది ఆమె తన రూమ్‌లో ప్రస్తుతం ఒక నిర్మాత వద్ద నుంచి అతని చిత్రంలో తను నటించబోయే హీరోయిన్ పాత్ర గురించి చర్చిస్తోంది అందుకే ఆమె తన గదిలోకి వెళ్ళిపోయింది

వంశీ వదనం మ్లానమైంది

నర్మద సినిమా నటేకాదు లక్షలు ఆర్జించింది ఇంకా ఆర్జిస్తుంది అఫ్ట్రాల్ సామాన్య మానవుడు తను అనుకున్నాడు

నర్మద నిర్మాతను సాగనంపేసరికి టైమ్ అర్ధరాత్రి పన్నెండు గంటలు ఇరవై నిమిషాలు అయింది ఆమె గెస్ట్ రూమ్‌లోకి వెళ్ళింది

సింగిల్‌కాట్‌పై నిద్రపోతున్నాడు వంశీ ప్రయాణంలో అలసిపోయిన అతనికి క్షణాల్లో నిద్ర పట్టేసింది

చిక్కి శల్యం అయిన అతని ఆకారాన్నిచూసింది నర్మద కళ్ళు మసకబారాయి వెనక్కి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది

మెత్తని ముఖమల్ పరుపు మీద పడుకున్న నర్మదకు నిద్రరావటంలేదు ఆమె హృదయంలో వంశీ రూపమే కదలాడుతోంది

వంశీ ఉత్సాహవంతుడైన యువకుడు డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు

నర్మద కాలేజీ బ్యూటీ ఆ ఇద్దరి మధ్యా ఏర్పడిన స్నేహం ప్రేమగా పుష్పించింది

ఫలితంగా వంశీ అయిన వారందర్నీ ఎదిరించి నర్మదను వివాహం చేసుకున్నాడు అతనికి త్వరలోనే చాలా చిన్న జాబ్ దొరికింది

అందగత్తె అయిన నర్మదకు ఆ డబ్బు తృప్తిగా ఉండేదికాదు తనలాటి అందగత్తె పెద్ద పెద్ద భవనాల్లో ఉండాలని ఆమె ఆలోచన

వంశీ అంటే ప్రేమే కానీ, అతను చేస్తున్న జాబ్ అంటే చాలా లేలిక

వంశీ ఎప్పటికప్పుడు నర్మదకు సర్ది చెప్పేవాడు. ఇద్దరం డిగ్రీలు పాసయ్యాం కనుక మంచి జాబే వస్తాయని అప్పుడు తమ జీవితాలు సుఖవంతం చేసుకోవచ్చని

నళిని అనే స్నేహితురాలితో కలిసి నర్మద ఒక సినిమా నటి సన్మానానికి వెళ్ళింది అక్కడ నర్మద అందాన్ని గమనించిన ఒక ప్రొడ్యూసర్ నర్మద ఎడ్రెస్ తీసుకున్నాడు

నర్మద సంతోషంతో తేలిపోతూ ఇంటికి వచ్చి వంశీతో ఆ విషయం చెప్పింది విన్న వంశీ పెదవి విరిచాడు తన భార్య పిచ్చేకాని సినిమావాళ్ళు ఎందుకు వస్తారు అనుకున్నాడు

మర్నాడు ఆ విషయమే విస్మరించి ఎప్పటిలా ఆఫీస్‌కు వెళ్ళిపోయాడు నర్మద మాత్రం ఏదో తెలీని ఆశతో ప్రొడ్యూసర్ రాక కోసం ఎదురు చూడసాగింది ఆ మధ్యాహ్నం రెండుగంటలకు వచ్చాడు ప్రొడ్యూసర్ కుమార్ నర్మద అతనికి సకల మర్యాదలు చేసింది అతని వెంట అతని ఫ్రెండ్ కూడా వచ్చాడు

వాళ్ళు అప్పటికప్పుడు నర్మదతో ఎగ్రిమెంటు రాయించుకుని అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళారు ఆ డబ్బుతో ఆమెను మద్రాస్ రమ్మని చెప్పి వెళ్ళిపోయారు

నర్మద ఈస్టమన్ కలర్ కలల్లో తేలిపోయింది సాయంత్రం వంశీ రాగానే పెద్ద పెద్ద కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అంతా చెప్పింది ఎగ్రిమెంట్ చూపించింది

వంశీ కోపంతో ఎగిరిపడ్డాడు నా అనుమతి లేకుండా ఎందుకు ఒప్పుకున్నావని నర్మద అతనికి నచ్చ చెప్పింది ఎన్నో ఆశలు చూపించింది

వంశీ లొంగలేదు ఆ ప్రొడ్యూసర్ ఉన్న హోటల్‌కు

వెళ్ళి అగ్రిమెంటు అడ్వాన్సు సొమ్ము ఇచ్చేద్దాం అని పట్టుపట్టాడు.

తన సువర్ణ జీవితంలో అవరోధాలు కల్పిస్తున్న వంశీపై నర్మదకు చాలా కోపం వచ్చింది.

తన నిర్ణయం మారేది లేదని కచ్చితంగా చెప్పేసింది. వంశీ హతాశుడయ్యాడు.

* * * * * *

వంశీని ఒంటరివాడిని చేసి నర్మద త్వరలోనే మద్రాస్ వెళ్ళిపోయింది. ప్రేమ వివాహం ఇలా విఫలం అయినందుకు వంశీని అయినవాళ్ళంతా హేళన చేశారు. వంశీ అది తట్టుకోలేకపోయాడు.

తనకు తెలిసిన కంట్రాక్టర్ దగ్గర గుమాస్తా ఉద్యోగం చూసుకుని మధ్యప్రదేశ్ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత నర్మద జీవితంలో ఎన్నో మార్పులు. ఆమె తన నటనా పటిమతో సినిమా రంగంలో తిరుగులేని ప్రతిభ కల నటి అయింది. ఎంతో డబ్బు కూడబెట్టింది.

అయినా ఆమె జీవితంలో ఏదో వెలితి. ఇంత కాలానికి ఆమె హృదయం పురివిప్పిన నెమలిలా ఆడసాగింది. వంశీ వచ్చాడు. తన ఇంటనే ఉన్నాడు అన్న ఊహ ఆమెలో పన్నీటి జల్లు కురిపించసాగింది.

అతనికి తనపైన కోపం పోయింది. దయతో తనను చేరవచ్చాడు. తాను అన్నిటిలో ఎంత అధికురాలు అయినా అతని ప్రేమ ముందు గడ్డిపోచే. అతని ప్రేమ తిరిగి తనకు లభించబోతోంది. ఇక తన జీవితం పూర్తిగా పరిపూర్ణత చెందుతుంది.

* * * * * *

నర్మద హృదయం మధుర రాగాలు ఆలపిస్తోంది. తెల్లవారు ఝామున నాలుగు గంటల వరకూ నిద్రాదేవత ఆమె దరి చేరలేదు.

నర్మదకు వెళ్ళి తన వంశీ సరసన చేరాలని పించింది.

కానీ అసలే వంశీ తనపై ఎన్నో అపార్థాలతో ఉండి ఉంటాడు. ప్రయాణ బడలిక కూడా తీరకుండా అతన్ని విసిగిస్తే అతను తనపై కోపం పెంచుకోవచ్చు. ఉదయం అతనికి అంతా చెప్పాలి. తను, తన పరిస్థితులు మారినా తన హృదయం మాత్రం అతని రూపంతోనే నిండి ఉందని చెప్పాలి అనేక తలపులతో నర్మదకు అప్పుడు నిద్రపట్టింది.

* * * * * * *

తిరిగి నర్మదకు మెలకువ వచ్చేసరికి పదిగంటలు దాటిపోయింది. ఆమెను నిద్ర లేపే సాహసం ఎవరికీ లేదు.

మెలకువ రావటంతోనే వంశీ గుర్తొచ్చాడు. చరాలున లేచి గెస్ట్ రూం లోకి వచ్చింది. అక్కడ వంశీలేడు. కానీ ఆ గదిలో గ్రాడెజ్ టేబుల్‌పై తెల్లని పాలరాయితో చేసిన తాజ్‌మహల్ మెరసి పోతూ ఉంది. అది నిన్నంతాలేదు. ఇవాళ ఎలా వచ్చిందో నర్మదకు అర్థం కాలేదు. బహుశః ఏ అభిమానులో వచ్చి ఇచ్చి ఉంటారనుకుంది. పని మనిషిని కేకేసింది. గెస్ట్ ఏరని అడిగింది.

"ఆయన ఉదయం ఏడు గంటలకు వెళ్ళిపోయారమ్మా"

"ఆ" ఒక్కసారిగా అగాథంలోకి పడిపోతున్నట్టుగా ఆర్తనాదం చేసింది.

'వెళ్ళిపోయారా!! వెళ్ళిపోయే వ్యక్తి ఒక్కరాత్రి కోసం ఎందుకు వచ్చారు??'

"అమ్మా!! ఆ బాబుగారు ఈ తాజ్‌మహల్ బొమ్మ బ్యాగ్ నుండి తీసి అక్కడబెట్టి ఆరు తెచ్చిన బ్యాగ్ ఖాళీగా పట్టుకెళ్ళిపోయారు. అమ్మగారు ఆరు ఒక లెటర్ కూడా ఇచ్చారు."

"లెటరా ఏదీ??" ఆత్రుతగా అడిగింది.

సీతాలు పరుపుకింద పెట్టిన లెటర్ ఇచ్చింది. నర్మద గబగబా విప్పి చదివింది.

"నర్మదా నేను చాలా సంవత్సరాలు మధ్యప్రదేశ్‌లో ఉండి తరువాత ఢిల్లీ వెళ్ళాను. సినిమా నటి కావాలన్న తృష్ణతో నువ్వు నా ప్రేమ తృణీకరించావు. కానీ ప్రేమికుల చిహ్నం అయిన తాజ్‌మహల్ ఎంతో అమరమయింది. నేను కువాయిట్ వెళ్ళిపోతున్నాను. బహుశః ఇక నా జీవితంలో తిరిగి రాలేనేమో. ఎందుకంటే ఈ గడ్డపైన నా ప్రియ భార్యలేదు (నాకు లేదు) ఆమె లేని ఈ గడ్డపై నేను అడుగు పెట్టలేను. అందుకే చివరిసారిగా నిన్ను చూడాలన్న తపన తాజ్‌మహల్‌ను చూస్తుంటే మరింత ఎక్కువ అయింది. నా ప్రేమ అంతా చిన్న తాజ్‌మహల్‌లో పొందు పరచి, అది నీకు కానుకగా ఇవ్వాలని తలచాను. అందుకే నీ ఇల్లు వెదుక్కుంటూ వచ్చాను.

కానీ నీలో కీర్తి అహంకారాన్ని పెంచింది. నువ్వు నన్ను చూడగానే ప్రేమాతిశయంతో అల్లుకు పోలేదు. పైపెచ్చు నన్ను పనిమనిషికి అప్పగించావు.

నా గదికి వస్తావని రాత్రి పన్నెండు అయ్యే వరకూ చూసాను. నువ్వు రాలేదు. అలసి పోయిన నేను నిద్ర పోయాను. అంతేకాదు. ఉదయం ఏడుగంటల వరకూ నీతో సమాగమంకోసం ఎదురు చూసాను. నీవు పడక గదిదాటి రాలేదు. నీలో ఎంతటి నిర్లక్ష్యం నాపై పేరుకు పోయి ఉందో గ్రహించాను.

నా ప్రేమ చిహ్నం అయిన తాజ్‌మహల్ నీకు వదలి వెళుతున్నాను.

ఇంక ఈ జీవితంలో నేను నీకు అడ్డురాను.

సెలవ్

వంశీ"

'ఎంత అపార్థం చేసుకున్నారు వంశీ!! నేను తలచింది ఒకటి అయితే జరిగింది వేరొకటి. తెల్లగా మెరిసిపోయే తాజ్‌మహల్‌ని చేతిలోకి తీసుకుంది. అంత స్వచ్ఛమైన వంశీ ప్రేమ అందులో కనబడింది. ఆర్తిగా దాన్ని గుండెలకు అదుముకుంది నర్మద. □

